సాక్షి కర్నూలు

బుధవారం । 28 । ఆగస్టు । 2024



భక్తుల సంతృప్తి సర్వే

శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సంతృప్తి సర్వే చేస్తున్నారు. ఇందుకోసం క్షేత్ర పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో క్యూఆర్ స్కాన్‌లను దేవస్థానం ఏర్పాటు చేసింది. ..8లో



బదిలీల్లో సందిగ్ధం

జెడ్పీ సీఈఓ, డీపీఓ బదిలీలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ విభాగంలో ఉద్యోగుల బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ..8లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,628.75
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 88.211
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 20,956
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 10,169

న్యూస్‌రీల్

ఉరుకుంద ఆదాయం రూ.1.06 కోట్లు



హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కౌతాళం: శ్రావణమాసం నాలుగో సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామికి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం కాలక్షేపపు మండపంలో లెక్కించారు. కానుకలు నగదు రూపంలో రూ.1,00,09,030, అన్నదానానికి రూ. 6,68,500.. మొత్తం రూ. 1,06,77,530 వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఉత్సవాల చీఫ్ ఆఫీసర్ పాండురంగారెడ్డి తెలిపారు. అలాగే వెండి 22.4కేజీలు, బంగారం ఎనిమిది గ్రాములు వచ్చిందన్నారు. హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆదోని భ్రమరాంబ సేవసమితి వారు పాల్గొన్నారు.

17 మండలాల్లో మోస్తరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 17 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. ఎమ్మిగనూరులో 16.4 మి.మీ, పెద్దకడుబూరులో 12.6, సి.బెళగల్‌లో 9.2, గోనెగండ్లలో 7, గూడూరులో 5.6, కోడుమూరులో 5.4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 164.3 మి.మీ వర్షం కురిసింది. రానున్న ఒకటి, రెండు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

'మంకీపాక్స్' చికిత్సకు ప్రత్యేక వార్డు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంకీపాక్స్ వ్యాధికి చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఇటీవల మంకీపాక్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వివిధ విభాగాల వైద్యులతో సమావేశం నిర్వహించారు. మంకీపాక్స్ కేసులు వస్తే యుద్ధప్రాతిపదికన చికిత్స అందించేందుకు ఐడీవార్డులో ఆరు పడకలు, అత్యాధునిక వైద్య పరికరాలతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులను, నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ రంగం, ఆర్థిక అక్షరాస్యతపై డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించి 90 ఏళ్లు నిండుతున్న నేపథ్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పోటీలకు సెప్టెంబరు 17 వరకు విద్యార్థులు www. rbi90 quiz. in/ students/ register లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. రాష్ట్ర, జోన్, జాతీయ స్థాయిలో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు.

ప్రొటెక్షన్ తప్పనిసరి



దేశంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీజీలపైనే దాడులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వారికి తప్పనిసరిగా ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా మహిళా పీజీలపై అఘాయిత్యాలు జరగకుండా సెక్యూరిటీ పెంచాలి. అవుట్‌పోస్టుల్లో కానిస్టేబుల్ సంఖ్యను పెంచడమే గాక దాడులు జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి వారించేలా వారికి శిక్షణ ఇవ్వాలి. ఇదే సమయంలో రోగుల సహాయకులకు వారు కౌన్సెలింగ్ చేయాలి. పీజీలకు వాష్‌రూమ్‌లు, రెస్ట్‌రూమ్‌లు తగినన్ని ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ బి. రమేష్‌బాబు, సైకియాట్రిస్ట్, కర్నూలు



పని గంటలు తగ్గించాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీజీలు చాలా బిజీగా ఉంటారు. వారు డ్యూటీ మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకోవడానికి హాస్టల్‌కు వెళ్లేందుకు కూడా సమయం ఉండదు. రోగులు చికిత్స కోసం వస్తూనే ఉంటారు. కొన్నిసార్లు వారు నిరంతరాయంగా 18 గంటల దాకా పనిచేయాల్సి వస్తోంది. ఎక్కువ పనిగంటలను తగ్గించి వారు చదువుకునేందుకు సైతం సమయం ఇవ్వాలి. సమ్మె తర్వాత గైనిక్ విభాగంలో డ్యూటీ చేసే పీజీల కోసం ఒక గదిని ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ కూడా పెంచారు. వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

–డాక్టర్ పి. స్నేహ, గైనకాలజిస్టు, జీజీహెచ్, కర్నూలు

అ'లా' మోసం!

అనుకున్నంతా అవుతోంది. రాయలసీమకు మరోమారు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు నిర్ణయం అటకెక్కుతోంది. కర్నూలుకు మంజూరైన లా యూనివర్సిటీతోపాటు ఇప్పటికే కొలువుదీరిన వివిధ న్యాయ సంస్థలను అమరావతికి తరలించేందుకు చంద్రబాబు సర్కారు సిద్ధమైంది. సీఎం నిర్ణయాలు, మంత్రుల ప్రకటనలు చూస్తే రాయలసీమకు మరోసారి తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు స్పష్టమవుతోంది.

అమరావతికి తరలించడం దుర్మార్గం



అమరావతిలో లా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైందంటే కర్నూలులో ఏర్పాటు చేయడం లేదని స్పష్టమవుతోంది. కర్నూలు యూనివర్సిటీ సంగతేంటో చెప్పాలి. రాష్ట్రానికి రెండో నేషనల్ లా యూనివర్సిటీ ఎక్కడా ఇవ్వరు. వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో అది సాధ్యమైంది. కేబినెట్ దీనికి ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. నిధులు మంజూరు చేశాం. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు రాయలసీమ హక్కు. ప్రతిసారి ఇలా సీమకు అన్యాయం చేయడం దారుణం. గత ప్రభుత్వం ఏం చేసినా దానిని వ్యతిరేకించడమే ఈ ప్రభుత్వ అజెండానా? ప్రభుత్వం దీనిపై సమాధానం చెప్పాలి. 'సీమ'కు అన్యాయం జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమం తప్పదు.

- బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి

హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే



హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మంత్రి టీజీ భరత్ చెప్పడం ఆమోదయోగ్యం కాదు. 2017లో హైకోర్టు కోసం ఉద్యమించాం. అప్పుడు చంద్రబాబు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. కుదరదు హైకోర్టు కావాలన్నాం. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. అయితే, న్యాయపర చిక్కులతో సాధ్యం కాలేదు. ఇప్పుడు హైకోర్టు ఏర్పాటు చేయకపోవడంతో పాటు లోకాయుక్త, హెచ్ఆర్సీ, ఏపీఈఆర్‌సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు కూడా అమరావతికి తరలించే యోచనలో ప్రభుత్వం ఉంది. సీమ వాసుల కాంక్ష మనోభావాలను గౌరవించి కర్నూలు హైకోర్టు ఏర్పాటు చేయాలి.

–రామిరెడ్డి,బార్ కౌన్సిల్ సభ్యుడు, అనంతపురం

కర్నూలుకు మంజూరైన నేషనల్ లా యూనివర్సిటీ అమరావతికి మార్పు

- కర్నూలులో హైకోర్టు కాకుండా బెంచ్ ఏర్పాటు చేస్తామన్న మంత్రి టీజీ భరత్
- జ్యుడీషియల్ సిటీ కోసం కర్నూలులో 273 ఎకరాలు కేటాయించిన జగన్ ప్రభుత్వం
- నేషనల్ లా యూనివర్సిటీకి 100 ఎకరాలు, రూ.వెయ్యి కోట్ల నిధులు
- ఇప్పటికే లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, సీబీఐ కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు
- వీటన్నింటినీ అమరావతికి తరలించేందుకు సిద్ధమైన ప్రభుత్వం



గత మార్చి 14న లా యూనివర్సిటీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇచ్చిన మాట మేరకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా రాయలసీమకు న్యాయం చేయాలనే సంకల్పంతో లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు కర్నూలులో స్థాపించారు. ఇవన్నీ కర్నూలు కేంద్రంగానే ఇప్పుడు పనిచేస్తున్నాయి. హైకోర్టు సైతం కర్నూలులో ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్), రైల్వే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఏసీబీ కోర్టు, కో–ఆపరేటివ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్, ఎండోమెంట్ ట్రిబ్యునల్‌తో పాటు 43 అనుబంధ కోర్టులు ఏర్పాటయ్యేవి. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చి ఉంటే న్యాయపరమైన చిక్కులు అధిగమించి హైకోర్టుతో పాటు ట్రిబ్యునల్స్ ఏర్పాటు కూడా జరిగి ఉండేది.

జ్యుడీషియల్ సిటీకి 273 ఎకరాల కేటాయింపు

కర్నూలులో జగన్నాథగట్టుపై జ్యుడీషియల్ సిటీ ఏర్పాటుకు జగన్ ప్రభుత్వం 273 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో నేషనల్ లా యూనివర్సిటీ, జ్యుడీషియల్ అండ్ లీగల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు వంద ఎకరాలు కేటాయించింది. రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేసింది. మంత్రివర్గ ఆమోదం తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో దీనికి శంకుస్థాపన కూడా చేశారు. రాష్ట్రానికి ఒక నేషనల్ లా యూనివర్సిటీకి మాత్రమే కేంద్రం అనుమతిస్తుంది. నిజానికి.. ఇప్పటికే వైజాగ్‌లో లా యూనివర్సిటీ ఉంది. నాటి సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పలుమార్లు కేంద్రంతో సంప్రదించి జిల్లాకు లా యూనివర్సిటీ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ఇవి కూడా అమరావతికే!?

మరోవైపు.. ఇటీవలే సొంత భవనంలో కొలువుదీరిన ఏపీఈఆర్‌సీతో పాటు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులను కూడా కర్నూలు నుంచి అమరావతికి తరలించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చే స్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రకటించారు.

హైకోర్టు ప్రశ్నపై ప్రభుత్వ మౌనం

ఏపీఈఆర్‌సీ, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టుల విషయంలో ఈనెల 21న ప్రభుత్వాన్ని రాష్ట్ర హైకోర్టు ఓ ప్రశ్నను సంధించింది. వీటిని కర్నూలులోనే ఉంచుతారా? లేక అమరావతికి తరలిస్తారా? అనే విషయంపై స్పష్టత కోరింది. అయినప్పటికీ ప్రభుత్వం కర్నూలులోనే ఉంచుతామని చెప్పలేకపోవడం చూస్తే తరలింపు లాంఛనమేనని తెలుస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే ఆయా విభాగాల ఉద్యోగులకు సైతం తరలింపునకు సిద్ధం కావాలని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

కర్నూలులో యూనివర్సిటీకి మంగళం

- టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైకోర్టు ఏర్పాటు సాధ్యం కాదని 'సీమ' ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ప్రతినిధులతో సమావేశమయ్యారు.
- అమరావతిలో నేషనల్ లా యూనివర్సిటీని బీసీఐ ఏర్పాటు చేయనుందని చంద్రబాబు తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.
- ఇప్పుడు దీనిపైనే న్యాయవాదుల్లో, రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. కర్నూలుకు మంజూరైన నేషనల్ లా యూనివర్సిటీని అటకెక్కించి, అమరావతిలో ఏర్పాటు చేయనున్నారనే చర్చ నడుస్తోంది.
- అయితే, అమరావతిలో బీసీఐ ఆధ్వర్యంలో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతోందని.. కర్నూలుకు, దీనికి సంబంధం లేదని కొందరు అంటున్నా ప్రభుత్వం మాత్రం స్పష్టత ఇవ్వలేదు.
- ఒకవేళ అమరావతిలో బీసీఐ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేస్తే కర్నూలులో యూనివర్సిటీ సంగతేంటని 'సీమ' వాసులు ప్రశ్నిస్తున్నారు.
- ఒకే రాష్ట్రంలో రెండు లా యూనివర్సిటీలు ఎక్కడా లేవు.
- అలాంటిది మూడు నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు అసాధ్యమని న్యాయవాదులు అంటున్నారు.
- దీన్నిబట్టి చూస్తే కర్నూలులో యూనివర్సిటీకి మంగళం పాడినట్టేనని స్పష్టం చేస్తున్నారు.

దీన్నిబట్టి చూస్తే కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తేలిపోయింది.

అందరి కాంక్ష 'కర్నూలులో హైకోర్టు'

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు బీజేపీ, జనసేన కూడా గతంలో మద్దతు పలికాయి. మంత్రి టీజీ భరత్ తండ్రి, బీజేపీ నేత, రాయలసీమ హక్కుల వేదిక అధ్యక్షుడు టీజీ వెంకటేశ్ కూడా పలు సందర్భాల్లో కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఏర్పాటు కోరుతూ కర్నూలు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు వంద రోజులకు పైగా రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. రాయలసీమ జిల్లాల ప్రజలు, ప్రజాప్రతినిధులు 'రాయలసీమ గర్జన' పేరుతో కర్నూలులో పెద్దఎత్తున ఉద్యమించారు. కానీ.. ఇప్పుడు మంత్రి టీజీ భరత్ ప్రకటన, నేషనల్ లా యూనివర్సిటీ తరలింపు, అనుబంధ న్యాయసంస్థలు తరలిస్తారనే ప్రచారం నేపథ్యంలో ఇక్కడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీలు నోరు మెదపడం లేదు.

చితికిపోతున్న టమాట రైతు!

- ధరలు పతనం
- పెట్టుబడి కూడా దక్కని వైనం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమాట



ఆస్పరి మార్కెట్‌లో..

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు పతనం కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో టమాట సాధారణ సాగు 5000 హెక్టార్లు ఉండగా.. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 1,400 హెక్టార్ల సాగైంది. కొద్ది రోజులుగా దిగుబడులు మార్కెట్‌కు వస్తున్నాయి. ఇంతలోనే ధరలు పడిపోవడంతో రైతులు నష్టాలు మూటకట్టుకుంటున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆస్పరి మండలంలో బిలేకల్, ఆస్పరిలో టమాట మార్కెట్‌లు ఉండగా.. ఇక్కడ 25 కిలోల బాక్స్‌కు రూ.125 ధర లభిస్తోంది. అయితే పత్తికొండలో ధరలు మెరుగ్గా ఉన్నాయని మార్కెటింగ్ శాఖ ప్రకటిస్తోంది. పత్తికొండలో క్వింటా కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1800 ఉన్నట్లు ప్రకటించింది.మోడల్ ధర కిలోకు రూ.16 ఉన్నట్లు నిర్ధారించింది. పత్తికొండకు, ఆస్పరి మండలానికి ఎంతో దూరం లేదు. ఇంతలోనే ధరల్లో ఇంత వ్యత్యాసం ఉంటుందా అనేది ప్రశ్నార్థకమవుతోంది.

ధర పలకని రెక్క కష్టం

పొలంలో 20 బాక్స్‌ల టమాట తెంపడానికి కూలీల ఖర్చు రూ.1,500 వస్తుంది. పొలం నుంచి మార్కెట్‌కు తరలించడానికి బాక్స్‌కు రూ.20 చొప్పున రూ.400 ఖర్చు అవుతోంది. మార్కెట్‌లో టమాట అమ్మించినందుకు కమీషన్ 10 శాతం చెల్లించాల్సి ఉంది. 20 బాక్స్‌ల టమాట రూ.125 ప్రకారం అమ్మితే రూ.2,500 వస్తుంది. దీనికి 10 శాతం కమీషన్ ప్రకారం రూ.250 చెల్లించాల్సి వస్తుంది. తెంపడం, ట్రాన్స్‌పోర్టు, కమీషన్‌ల కింద రూ.2,150 ఖర్చు అవుతుంది. అంటే 20 బాక్స్‌ల టమాటపై రైతుకు మిగులుతుంది కేవలం రూ.350 మాత్రమే. ఇలా అయితే పెట్టుబడి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకం అవుతోంది. టమాట సాగులో ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి వ్యయం ఉంటోంది. రేయింబవళ్లు కష్టించినప్పటికి కనీసం పెట్టుబడి కూడా దక్కకపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

స్పందించని ప్రభుత్వం

టమాట ధరలు పడిపోయినపుడు గత ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను రంగంలోకి దింపేది. వ్యాపారుల కంటే అధిక ధరతో రైతుల నుంచి కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలించేది. ప్రస్తుతం టమాట ధరలు పతనం అయినప్పటికి కూటమి ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అనంతపురం జిల్లాలో మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి టమాట కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. కర్నూలు జిల్లాలో మాత్రం ఈ పరిస్థితి లేకపోవడం గమనార్హం. కారణమేమిటంటే పత్తికొండ మార్కెట్‌లో ధర మెరుగ్గా ఉన్నట్లుగా చెబుతున్నారు.

నష్టమే మిగిలింది



రెండు ఎకరాల్లో టమాట సాగు చేశాం. ఎకరాకు రూ.20 వేల ప్రకారం రూ.40 వేలు పెట్టుబడి పెట్టాం. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడి కాదు గదా.. కూలీల ఖర్చులు కూడా రాకావడం కష్టమైంది. మంగళవారం 16 బాక్స్‌ల టమాట తెచ్చాం. ఇందుకు ఆరుగురు కూలీలను పెట్టాల్సి వచ్చింది. వీరికి రూ.250 ప్రకారం రూ.1,500 చెల్లించాము. రవాణాకు రూ.320 ఖర్చు అయింది. 25 కిలోల బాక్స్ ధర రూ.125 ప్రకారం అమ్మగా.. రూ.2000 వచ్చింది. దీనికి కమీషన్ ఏజెంటు రూ.200 కమీషన్ తీసుకున్నారు. మొత్తం ఖర్చు రూ.2020 వచ్చింది. పంట అమ్మితే రూ.2000 వచ్చింది. చివరికి నష్టమే మిగిలింది. ధర ఇలా ఉంటే రైతు ఎలా బతుకుతారు.

– కృష్ణమూర్తి, అయినగల్, ఆస్పరి మండలం

రేపటి నుంచి అందుబాటులోకి ఇసుక



కర్నూలు(టౌన్): వినియోగదారులకు ఈనెల 29 నుంచి ఇసుక అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సంబంధిత ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ కౌతాళం మండలం గుడికంబాళి తరువాత డిమాండ్ ఉన్న దృష్ట్యా ఇసుక స్టాక్ పాయింట్లను పెంచామన్నారు. సి.బెళగల్ మండలంలో ఐదు ఇసుక స్టాక్ పాయింట్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వినియోగదారులు కర్నూలులోని జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉపసంచాలకుల కార్యాలయం,సి.బెళగల్ మండలంలోని తహసీల్దారు కార్యాలయం వద్దనున్న సచివాలయంలో ఇసుకను బుక్ చేసుకోవచ్చన్నారు. టన్ను ఇసుక రూ.326 చొప్పున విక్రయిస్తున్నామన్నారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: నేరాల నియంత్రణకు పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. కేసుల దర్యాప్తులో పురోగతి చూపాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మంగళవారం ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జరిగిన నేర సమీక్షలో సబ్ డివిజన్ల వారీగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఆరా తీశారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే నెల సమీక్ష సమయానికి తగ్గించకపోతే సంబంధిత అధికారులకు చార్జ్ మెమోలు ఇస్తానని ఎస్పీ హెచ్చరించారు. చోరీకి గురైన ప్రాపర్టీలను రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును ఎలా పూర్తి చేయాలో సూచనలు, సలహాలు ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ స్టేషన్ల వారీగా సదస్సులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. వినాయక చవితి, దసరా వంటి పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విగ్రహాల దగ్గర సీసీ కెమెరాలు, కాపలాదారులు ఉండే విధంగా మండపాల నిర్వాహకులు చర్యలు తీసుకునే విధంగా చూసుకోవాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో బందోబస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పోలీసు గస్తీ, విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో పికెట్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీలు, సీఐలకు కాల పరిమితి నిర్ణయించి పెండింగ్ కేసులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిభ కనబరచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు...

గాజులదిన్నె ప్రాజెక్టులో ఐరన్‌బండ, గంజిహల్లి గ్రామ రైతులు వరదనీటిలో చిక్కుకున్న 32 మంది ప్రజల ప్రాణాలు కాపాడిన గోనెగండ్ల పోలీసులను ఎస్పీ అభినందించారు. సీఐ గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్ల బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లుకు ప్రశంస పత్రాలను అందజేశారు. అలాగే కర్నూలులో గంజాయి విక్రయదారులను పట్టుకుని జైలుకు పంపినందుకు మూడో పట్టణ ఎస్ఐ మన్మథ విజయ్‌ను, గూడూరుకు చెందిన బంగారు వ్యాపారి దమామ్ వెంకటేశ్వర్లు కిడ్నాప్ కేసును ఛేదించినందుకు సహకరించిన ప్రస్తుత కోడుమూరు పీఎస్ ఎస్ఐ శ్రీనివాసులు చేసిన కృషిని ఎస్పీ అభినందించి వారందరికీ ప్రశంస పత్రాలు అందజేశారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకటరామయ్య, సోమన్న, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, పీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఈఈలకు స్థాన చలనం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 10 మంది పంచాయతీరాజ్ డీఈఈలకు స్థాన చలనం కలిగింది. ఈ నెల 26వ తేదీన అనంతపురం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వీరి బదిలీలు దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. బదిలీ అయిన వారిలో పాణ్యం పీఆర్‌ఐ నుంచి మనోహర్ ఆలూరుకు, పీఐయూ నందికొట్కూరు నుంచి లక్ష్మీనారాయణ పీఐయూ పత్తికొండకు, పీఆర్‌ఐ ఆలూరు నుంచి శ్రీరాములు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే పత్తికొండ పీఐయూ నుంచి రమేష్‌కుమార్‌రెడ్డి పీఏ టు ఈఈ కర్నూలుకు, నాగిరెడ్డి పీఏ టు ఈఈ కర్నూలు నుంచి పాణ్యం పీఆర్‌ఐకి బదిలీ అయ్యారు. ఆదోని పీఆర్‌ఐ నుంచి రంగస్వామి మంత్రాలయంకు, అశ్వర్థామ మంత్రాలయం నుంచి ఆదోని పీఆర్‌ఐకి, నంద్యాల పీఆర్‌ఐ నుంచి గంగాధర్ పీఆర్‌ఐ డోన్‌కు, కోడుమూరు పీఆర్‌ఐ నుంచి మహేశ్వరరెడ్డి కర్నూలు పీఐయూకి, కర్నూలు ఎస్‌ఎస్‌ఏ నుంచి కర్రెన్న పీఆర్‌ఐ కోడుమూరుకు బదిలీ అయ్యారు. వీరందరికీ అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

2న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజి ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులో పూరించిన విషయాలకు సంబంధించి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఇంటర్‌మీడియట్ బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందులో కూడా మార్కులు, రోస్టర్ ఆధారంగా అర్హులైన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు.

శ్రీశైలంలో భక్తుల సంతృప్తి సర్వే



భక్తుల సంతృప్తి సర్వే పేరుతో గూగుల్ షీట్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి మాస్టర్ ప్లాన్ తయారు చేసే క్రియేటివ్ సొల్యూషన్స్ సంస్థ ద్వారా క్షేత్రంలో భక్తుల సంతృప్తి సర్వే చేస్తున్నారు. ఇందుకోసం క్షేత్ర పరిధిలోని వసతి విభాగాల వద్ద, కేంద్ర విచారణ కార్యాలయం, ఈఓ ఆఫీసు, భక్తులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో క్యూఆర్ స్కాన్‌లను దేవస్థానం ఏర్పాటు చేసింది. భక్తులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గూగుల్ షీట్ ఓపెన్ అవుతుంది. ఇందులో తొమ్మిది ప్రశ్నలు ఉంటాయి. భక్తులు తమ అభిప్రాయాలను పొందుపర్చవచ్చు. భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఈ సర్వే కొంత మేర ఉపయోగపడనుంది.

పోలీసు గస్తీ పెంచాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. అత్యవసర విభాగం, వార్డుల్లో సెక్యూరిటీ గార్డులతో పాటు పోలీస్ సిబ్బందిని విధుల్లో ఉంచాలి. అప్పుడే దాడి చేయడానికి ఎవరైనా భయపడతారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి వస్తుంటారు. అలాంటి సమయంలో సేవలందించేందుకు ఇబ్బందికరంగా ఉంటుంది. వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– వసంత, స్టాఫ్ నర్సు బేతంచెర్ల సీహెచ్‌సీ



భద్రతా చట్టాలు పటిష్టం చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయిచేసుకోవడం ఎంత నేరమో.. అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడిచేయడం, అమర్యాదగా మాట్లాడడం అంతే నేరంగా పరిగణించి కఠినంగా శిక్షించాలి. వైద్యులంటే ప్రాణరక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం రావాలి.

– డాక్టర్ రజిని, దంత వైద్యురాలు, పీహెచ్‌సీ, గోనెగండ్ల

పీఆర్ ఉద్యోగుల బదిలీల్లో సందిగ్ధం

పూర్తయిన దరఖాస్తుల స్వీకరణ
- జెడ్పీ సీఈఓ, డీపీఓ బదిలీపై ఊహాగానాలు
- కొత్త అధికారుల నేతృత్వంలోనే బదిలీలంటూ ప్రచారం



జిల్లా పరిషత్ కార్యాలయం

కర్నూలు(అర్బన్): పంచాయతీ రాజ్ విభాగంలో ఉద్యోగుల బదిలీలపై కొంత సందిగ్ధం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో జెడ్పీ పరిధిలో 410 మంది, డీపీఓ పరిధిలో 267 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అనుగుణంగానే దరఖాస్తులను పరిశీలించి సీనియారిటీ జాబితాలు సిద్ధం చేశారు. అయితే బదిలీలను నిర్వహించాల్సిన జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారుల బదిలీలు ఏ క్షణమైనా జరిగే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పైగా కొత్తగా వచ్చే అధికారుల నేతృత్వంలోనే ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల్లో కొంత నిరాశ కనిపిస్తోంది. ఇప్పటికే బదిలీలకు అర్హులైన వారు, రిక్వెస్ట్ బదిలీలను కోరుతున్న వారు తమకు అనుకూలమైన మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీల నుంచి సిఫారసు చేయించుకున్నారు. బదిలీల అంకం చివరి దశకు చేరుకున్న తరుణంలో ఆయా శాఖలకు చెందిన అధికారులకు బదిలీలు తప్పవనే ప్రచారం జోరందుకోవడం గమనార్హం. కొత్తగా వచ్చే అధికారులకు మరోసారి సంబంధిత ప్రజా ప్రతినిధుల చేత సిఫారసు చేయించు కోవాల్సి ఉంటుందని ఆందోళనకు గురవుతున్నారు.

బదిలీలపై ఎన్నెన్నో ఊహాగానాలు

జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు బదిలీలపై సంబంధిత కార్యాలయాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి. నాసరరెడ్డి స్థానంలో గతంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వహించి ప్రస్తుతం నంద్యాల జిల్లా డ్వామాలో పనిచేస్తున్న టి.విజయభాస్కర్‌నాయుడు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే డీపీఓ నాగరాజునాయుడు స్థానం పదిలంగా ఉన్నట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ పోస్టుకు ఒకరిద్దరు ప్రయత్నాలు చేస్తున్నా, ప్రస్తుత డీపీఓనే కొనసాగించేందుకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు అంగీకరించినట్లు తెలుస్తోంది.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకరరెడ్డి

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ సుధాకరరెడ్డి, ఐఈ సమన్వయ కర్త రఘురాంరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత గురించి ఆరా తీయగా పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉందని ప్రధానోపాధ్యాయుడు గోపాల్ ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫామ్, షూ గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్టీటీ క్యాంపును పరిశీలించారు. అనంతరం భవిత కేంద్రాన్ని పరిశీలించి ప్రత్యేక అవసరాల విద్యార్థుల వివరాలను అడిగారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న సదుపాయాలు, ఉపకరణాలు, రవాణా భత్యం అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. ఎంఈఓ బాలాజీనాయక్, ఐఈ ఆర్టీలు షంషుద్దీన్, రామ్మూర్తి వెంట ఉన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు

- తిరిగి స్వాధీనం చేస్తున్న రెవెన్యూ అధికారులు



కొత్తాళం రెవెన్యూ కార్యాలయం

కౌతాళం: ఎలాంటి విచారణ చేపట్టకుండా కౌతాళం తహసీల్దారు కార్యాలయం నుంచి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. అనంతరం అప్రమత్తమైన అధికారులు దానిని తిరిగి స్వాధీనం చేసుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. తహసీల్దారు మల్లికార్జున స్వామి తెలిపిన వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన నల్లగోడి శ్రీనివాసులు తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందాడు. ఈ విషయంపై కొందరు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. రెండు నెలల్లో అసలైన ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయన బదినేహాల్ గ్రామవాసిగా తప్పుడు అధార్ కార్డు సృష్టించి దాని ఆధారంగా కౌతాళం తహసీల్దారు కార్యాలయంలో ఎస్టీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతని దరఖాస్తును వీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి విచారించకుండా సంతకం చేసి తహసీల్దారుకు పంపారు. తహసీల్దారు కూడా ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేశారు. అనుమానం వచ్చిన వీఆర్‌ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బదినేహాల్ గ్రామంలో విచారించగా అలాంటి పేరు గల వ్యక్తి ఎవరూ లేరని తేలింది. శ్రీనివాసులును ఫోన్‌లో సంప్రదించి తమ వద్దకు పిలిపించుకుని కుల ధ్రువీకరణ పత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. తప్పుడు ఆధార్‌కార్డు చిరునామాతో కుల ధ్రువీకరణ పత్రం పొందిన శ్రీనివాసులుపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్‌ఓపై కలెక్టర్‌కు నివేదికను పంపుతున్నట్లు తహసీల్దారు తెలిపారు.

ఏపీఎస్‌ఎల్‌డీసీ ఐదేళ్ల ప్రణాళిక

కర్నూలు (అగ్రికల్చర్): 2024–25 నుంచి 2028–29 వరకు వివిధ ఆర్థికపరమైన అంశాలపై ఏపీఎస్‌ఎల్‌డీసీ వార్షిక రుసుం, జనరేటింగ్ కంపెనీల నుంచి వసూలు చేయవలసిన ఆపరేటింగ్ చార్జీల (క్యాప్టివ్ లైసెన్స్‌ల పంపిణీతో సహా)పై ఏపీఈఆర్‌సీ తన నిర్ణయాలను ప్రకటించింది. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన సభ్యులు సమావేశమై ఏపీఎస్‌ఎల్‌డీసీ దాఖలు చేసిన పటిషన్‌పై మల్టీ ఇయర్ ఉత్తర్వులను జారీ చేసింది. ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఓపెన్ యాక్సెస్ యూజర్లు, ట్రేడింగ్ లైసెన్స్‌లు తదితర వాటిపై ఏపీ ట్రాన్స్‌కో దాఖలు చేసిన పిటిషన్‌ను ఏపీఈఆర్‌సీ పరిష్కరించింది. రానున్న ఐదేళ్లలో రూ.128.21 కోట్లు పెట్టుబడులకు అనుమతి కోరగా ఏపీఈఆర్‌సీ రూ.124 కోట్లకు అనుమతి ఇచ్చింది. మూలధన వ్యయం రూ.271.18 కోట్లకు అనుమతి కోరగా రూ.229.49 కోట్లకు, నిర్వహణ ఖర్చుల కింద రూ.438 కోట్లు రాబట్టుకునేందుకు అనుమతి కోరగా.. రూ.397.51 కోట్లకు అనుమతి లభించింది. వచ్చే ఐదేళ్లలో వార్షిక రుసుములు, నిర్వహణ చార్జీలపై మెగా వాట్స్ ప్రకారం నిర్ణయాలను ఏపీఈఆర్‌సీ నిర్ణయాలను వెలువరించింది.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డు తెగలకు చెందిన విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ఆయా సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి జే.రంగలక్ష్మిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వంద మంది గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సొసైటీల చట్టం/ ట్రస్ట్/ ప్రొప్రైటరీ ఫర్మ్‌ల కింద నమోదై ఐదేళ్ల నుంచి డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన శిక్షణా సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులను ఆయా సంస్థలకు కేటాయిస్తామని వివరించారు. శిక్షణా సంస్థలు తమ బోధనా సిబ్బంది వివరాలు, గత ఐదేళ్ల ఫలితాలు, ఫీజు వివరాలతో సెప్టెంబర్ 3వ తేదీలోగా బిర్లా గేట్ సమీపంలోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు ఫోన్ 94910 230041 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక వృక్షం





కదంబ వృక్షం.. ఏడాది పొడవునా ఆకుపచ్చగా అలరారే ఈ వృక్షం జగన్మాతకు ఎంతో ప్రీతికరం. ఈ వృక్షం ఉన్న ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందంటారు. శ్రీకృష్ణుడు గోపికల చీరలను దొంగిలించి దాచింది కూడా ఈ వృక్షంపైనే అంటారు. చదువుల తల్లి కొలువైన బాసర సరస్వతి అమ్మవారి ఆలయ పరిసరాల్లో వేలాది కదంబ వృక్షాలు కనువిందు చేస్తాయి. ముఖద్వారం మొదలు అడుగడుగునా భక్తులకు స్వాగతం పలుకుతాయి. గుండ్రని ఆకారంలో ఉండే ఈ వృక్షం పుష్పాలను ఎక్కువగా లలితాదేవి పూజలో ఉపయోగిస్తుండటం విశేషం. అత్యంత అరుదైన ఈ వృక్షం ఇప్పుడు కర్నూలు నగరంలోనూ కనిపిస్తోంది. నగరంలోని గణేష్‌నగర్‌లో ఓ ఇంటి ముందున్న ఈ కదంబ వృక్షం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

మడుగు దాటనిదే బడికి చేరలేరు!



బడికి వెళ్లే మార్గంలోని బురద నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

జూపాడుబంగ్లా: మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారి కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ లింగాల స్వాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో కలిసి ఆ మార్గంలో వర్షపునీటితో ఏర్పడిన గుంతలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణం వల్ల విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు దారిలేకుండా పోయిందన్నారు. నేషనల్ హైవే అధికారులు పాఠశాలకు ఎదురుగా అండర్ టన్నెల్ బ్రిడ్జిని నిర్మించినప్పటికీ తక్కువ ఎత్తులో ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా వంతెన కింద మోకాలిలోతు నీరు నిలిచి విద్యార్థులు మురికి నీళ్లలోనే నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారి కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం వెంకన్న అనే వ్యక్తి పల్సర్ బైకుపై (90 ఎం.ఎల్ పరిమాణం గల 192 టెట్రా ప్యాకెట్లను) కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, అమ్మినా, నాటుసారా తయారు చేసినా వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

రేపు కర్నూలులో విద్యుత్ శాఖ రాష్ట్ర స్థాయి సదస్సు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఈ నెల 29న కర్నూలులో కీలకమైన సదస్సు నిర్వహిస్తోంది. స్టేట్ కో–ఆర్డినేషన్ ఫోరం ఫర్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్ రూపకల్పనకు ఈ సదస్సు ఏర్పాటవుతోంది. సదస్సుకు ఎనర్జీ సెక్రటరీ విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, తిరుపతి, వైజాగ్, విజయవాడ డిస్కమ్‌ల సీఎండీలు, పలువురు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వడ్డె అంజి (ఫైల్)

కౌతాళం: గ్రామంలో పనులు లేక పొట్టకూటి కోసం పట్టణానికి వలస వెళ్లిన ఓ యువకుడు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని గుడికంబాలి గ్రామానికి చెందిన వడ్డె నాగేశ్, బొజ్జమ్మ దంపతుల రెండవ కుమారుడు వడ్డె అంజి (21) బేల్దార్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఆ దంపతులు తమ ఇద్దరు కుమారులతో కొద్దికాలంగా బెంగళూరు పట్టణానికి వలస వెళ్లి బేల్దార్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో మంగళవారం ఉదయం ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా అంజి విద్యుదాఘాతానికి గురికావడంతో స్పృహ తప్పి పడిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అమలుకున్నాయి.

కుళ్లిన పైరు.. రైతుకు కన్నీరు

మండలంలో రెండు వారాల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతులకు తీవ్ర వేదన మిగిల్చాయి. భారీ వర్షాలకు పంటపొలాల్లో నీరు నిలిచి కంది, పత్తి, వేరుశనగ తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నంచర్ల, చిప్పగిరి, దౌల్తాపురం, నగరడోణ, రామదుర్గం, ఏరూరు తదితర గ్రామాల్లో పైర్లన్నీ నీటమునిగి కుళ్లిపోయాయి. పూర్తిగా దెబ్బతిన్న పైర్లను తొలగించి రబీ సాగులో భాగంగా విత్తనం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని కోరుతున్నారు.

– చిప్పగిరి



చిప్పగిరిలో కుళ్లిన కంది పైరు



నంచర్లలో ఎండిపోయిన కంది పంట



నంచర్లలో పూర్తిగా దెబ్బతిన్న కంది పంట